ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
బుధవారం 16 అక్టోబరు 2024





మాట్లాడుతున్న ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ సభ్యులు

ఏరియా ఆసుపత్రిని పట్టించుకోని ఎమ్మెల్యే

బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏరియా ఆసుపత్రి సమస్యలను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని సింగరేణి ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం ఏరియా ఆసుపత్రి ఆవరణలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైద్యులు, మందుల కొరత ఉండడంతో కొన్ని నెలల క్రితం జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టామన్నారు. ఏరియా ఆసుపత్రి ఎదుట నిరాహార దీక్షలు చేయగా సెప్టెంబరు 30లోపు ఆసుపత్రి సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో దీక్ష విరమించామన్నారు. నేటి వరకు ఆసుపత్రిలో ఎలాంటి వైద్య సేవలు మెరుగు పడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే స్పందించి ఏరియా ఆసుపత్రిలో మందులు, వైద్యులను అందుబాటులో ఉంచాలని కోరారు. ఆసుపత్రి పరిరక్షణ కమిటీ సభ్యులు ఎండీ చాంద్‌పాషా, మణిరాంసింగ్, మహేందర్, రాజన్న, శంకర్, మల్లయ్య పాల్గొన్నారు.

బెటాలియన్‌లో క్రీడా పోటీలు



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న కమాండెంట్ వెంకటరాములు

హాజీపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గుడిపేట 13వ బెటాలియన్‌లో మంగళవారం క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. నాలుగు రోజులపాటు జరిగే పోటీల్లో టగ్‌ఆఫ్ వార్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పరుగు పందెం నిర్వహిస్తామన్నారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్‌రావు, కాళిదాసు, యూనిట్ మెడికల్ ఆఫీసర్ సంతోష్‌సింగ్, బెటాలియన్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు మహర్షి వాల్మీకి జయంతి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహిస్తామని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

రూ.10 నాణేలపై అవగాహన

హాజీపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ సతీష్ కుమార్ మంగళవారం రూ.10 నాణేలపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. రూ.10 నాణెం చెల్లుబాటు అవుతుందని ఆర్‌బీఐ ప్రకటించిందన్నారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని వ్యాపారులకు సూచించారు. అనంతరం వ్యాపారులు లక్ష రూపాయల విలువ చేసే నాణేలను తీసుకున్నారు. క్యాషియర్ రమేష్, మనోహర్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందన్‌పల్లి ఎఫ్ఆర్‌వోగా శ్రీనివాస్



జన్నారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్ ఇందన్‌పల్లి ఎఫ్ఆర్‌వోగా కారం శ్రీనివాస్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మంచిర్యాలలో అటవీ శాఖ ట్రాన్స్‌పోర్టులో బాధ్యతలు నిర్వహించారు. గతం లో ఇక్కడ పని చేసిన హఫీజొద్దీన్ లక్సెట్టిపేట డీఆర్‌వోగా బదిలీపై వెళ్లారు.

పేరుకుపోయిన బకాయిలు

- రెసిడెన్షియల్ పాఠశాలలకు నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- మూకుమ్మడిగా భవనాలకు యజమానుల తాళాలు
- ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం
- మంత్రి పొన్నం హామీతో దిగొచ్చిన యజమానులు



తాండూరులో భవనానికి తాళం వేస్తున్న యజమాని



బెల్లంపల్లిలో

మంచిర్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు చేసింది. జిల్లాలో బాలురు, బాలికలకు సంబంధించి ఎనిమిది రకాల మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలున్నాయి. అయితే అవి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటి బకాయిలు నెలలుగా పేరుకుపోయాయి. ఆయా పాఠశాలల్లో ఒక్కో చోట సగటున 640 మంది విద్యార్థుల చొప్పున జిల్లా వ్యాప్తంగా కనీసం ఐదు వేల మంది 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసిస్తున్నారు.

వివిధ వర్గాల వారీగా స్కూళ్లు ఏర్పాటు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత వివిధ వర్గాలకు చెందిన పిల్లల కోసం కస్తూర్బా, జ్యోతిబాపూలే, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రెసిడెన్షియల్ పేర్లతో పాఠశాలలు ఏర్పాటయ్యాయి. ఆయా పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకొని స్కూళ్లను ప్రారంభించింది. విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతోపాటు అవసరమైన అన్ని వసతులను సమకూర్చింది. ఆర్థికంగా వెనుకబడిన కులస్థులు వాటిపై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారు.

పేరుకుపోయిన బకాయిలు

జిల్లాలో వివిధ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లతోపాటు జ్యోతిబాపూలే గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వాటికి ఏరియాను బట్టి సాలుసరి అద్దె రూ.9 లక్షలు మొదలుకొని రూ.18 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. రాష్ట్రం ఏర్పాటు తరువాత 2017లో పాఠశాలలు ప్రారంభించిన నాటి నుంచి గత విద్యా సంవత్సరం వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పాఠశాల నిర్వహణ సాగింది. తొమ్మిది నెలలుగా పాఠశాలల్లో సమస్యలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొమ్మిది నెలలుగా జ్యోతిబాపూలే పాఠశాలల భవనాలకు అద్దె చెల్లించకపోవడంతో సమస్యలు తెరపైకి వచ్చాయి. అద్దె చెల్లించాలని యజమానులు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పెడచెవిన పెట్టడంతో వారంతా ఆందోళన బాట పట్టారు. ప్రైవేటు భవన యజమానుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మూకుమ్మడిగా పాఠశాలలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. జిల్లాలోని చెన్నూరు, లక్సెట్టిపేట, మందమర్రి, బెల్లంపల్లి, తాండూరులలోని జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలకు యజమానులు తాళాలు వేశారు.

పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో..

ప్రభుత్వం అద్దె చెల్లించని కారణంగా భవనాలకు తాళాలు వేశామని యజమానులు చెబుతున్నారు. దసరా సెలవులు ముగిసి మంగళవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావలసి ఉంది.

...మిగితా 7లో

గిరిజన గూడేల్లో గుస్సాడీ సందడి

- పౌర్ణమి నుంచి అమావాస్య వరకు
- ప్రత్యేక అలంకరణ, ఆటాపాటలు

7



పద్మాల్‌పురి ఆలయం వద్ద కొత్త కోడళ్లలను పరిచయం చేస్తున్న దృశ్యం(ఫైల్)

నిధుల జాడేది..?

- విడుదల కాని 15వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి నిధులు
- మున్సిపాలిటీలో ముందుకు సాగని పనులు

6



తీరనున్న ఉపాధ్యాయుల కొరత

- ముగిసిన ఉపాధ్యాయుల కౌన్సెలింగ్
- పోస్టుల భర్తీతో విద్య వ్యవస్థ పటిష్టం
- నేటి నుంచి విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులు



బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు కొలువుదీరనున్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కలెక్టరేట్‌లో పోస్టింగ్ ఆర్డర్లు అధికారులు కేటాయించారు. అనంతరం ర్యాంకింగ్ ఆధారంగా ఆయా పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. కొత్త ఉపాధ్యాయులు ఏ పాఠశాలలో విధులు నిర్వహించాలో తేలడంతో బుధవారం ఆయా పాఠశాలల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. దీంతో కొత్త ఉపాధ్యాయుల రాకతో విద్యార్థులకు మెరుగైన బోధన అందనుంది. నియామక పత్రాలు అందుకున్న తర్వాత వారం రోజుల నుంచి పోస్టింగ్ ఎక్కడ వస్తుందోనని ఉత్కంఠగా ఎదురు చూసిన ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు రావడంతో ఉత్కంఠకు తెరపడింది.

జిల్లాలో పోస్టుల భర్తీ ఇలా...

జిల్లాలో 288 పోస్టులతో ప్రభుత్వం మెగా డీఎస్సీ 2024ను ప్రకటించింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 70, ఎస్టీటీ 176, భాషా పండితులు 16, పీఈటీ 3, స్పెషల్ ఎడ్యుకేటర్స్ 23 ఉన్నాయి. మొత్తం 288 పోస్టులకు గాను 248 పోస్టులు భర్తీ చేశారు. ఈమేరకు విద్యాశాఖ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి ఆర్డరు కాపీలను ఉపాధ్యాయులకు అందజేశారు.

ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైనది



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భావితరాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనదని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఎస్సీ 2024లో అభ్యర్థులకు పోస్టింగ్ కౌన్సెలింగ్ కార్యక్రమానికి డీఈవో యాదయ్యతో కలిసి హాజరయ్యారు. కలె క్టర్ మాట్లాడుతూ పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తూ వారి భవిష్యత్ తీర్చిదిద్దే ఉపాధ్యాయవృత్తి బాధ్యతాయుతమైనదని అన్నారు. ఉపాధ్యాయులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాల సాధన దిశగా కృషి చేయాలన్నారు. జిల్లాలో 288 పోస్టులు ఖాళీగా ఉండగా 248 మంది అర్హత సాధించారని, కౌన్సెలింగ్‌కు 230మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి 'కాసుల' వర్షం

- ప్రయాణికులతో బస్టాండ్‌లు కిటకిట
- ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.4.68 కోట్లు



మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో కిక్కిరిసి ఉన్న ప్రయాణీకులు

బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండగలకు ఆర్టీసీకి భారీగా ఆదాయం వచ్చింది. పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపించడంతో కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. పండుగ సెలవులు ముగియడంతో జిల్లా ప్రజలు పట్టణాల బాట పట్టారు.

● 14 రోజుల్లో ఆర్టీసీ ఆదాయం రూ. 4.68 కోట్లు

జిల్లాలో మొత్తం ఆర్టీసీ బస్సులు 125 ఉన్నాయి. ఇందులో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, స్లీపర్, రాజధాని, లహరి బస్సులు ఉన్నాయి. బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 1నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేకంగా 50కి పైగా అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. ఎక్కువ మంది ప్రయాణికులు హైద్రాబాద్ నుంచి జిల్లాలోని వారి సొంత ఊర్లకు రావడం అనంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేకంగా హైద్రాబాద్ (జేబీఎస్)కు 27ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈనెల 1నుంచి 14వ తేదీ వరకు జిల్లాలోని ఆర్టీసీ బస్సులు మొత్తం 83,77,079 కిలో మీటర్లు ప్రయాణించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాయి. 8,27,740 మంది ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేరవేసి రూ. 4,68,43,648 ఆదాయం సాధించింది.

● తిరుగు ప్రయాణంలో..

సొంత ఊర్లలో ఉత్సాహంగా పండుగ చేసుకున్న జిల్లా ప్రజలు హైద్రాబాద్, ఇతర పట్టణాలకు తిరుగు ప్రయాణం కావడంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. నిత్యం వేలాది మంది ప్రజలు తరలి వెళ్తున్నారు. దీంతో రద్దీకి అనుగుణంగా మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, లక్సెట్టిపేట ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు కేటాయిం చారు. మరో రెండు రోజుల పాటు తిరుగు ప్రయాణం చేసే వారి కోసం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

అందరి కృషితోనే ఆదాయం



ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లు, కండకర్ల సహకారంతో ఆర్టీసీకి ఆదాయం కలిసి వచ్చింది. పండగల నేపథ్యంలో ప్రయాణి కుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా అదనపు బస్సులను ఏర్పాటు చేశాం. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. ఆర్టీసీపై ఆదరణ చూపిన ప్రయాణికులకు కృతజ్ఞతలు.

- జనార్దన్, డీఎం, మంచిర్యాల

స్థానిక సంస్థల ఎన్నికలో బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



కోర్విచెల్మలో పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

దండేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు పార్టీ నాయకులు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం దండేపల్లి, కోర్విచెల్మ గ్రామంలో ఆన్‌లైన్ సభ్యత్వ నమోదులో పాల్గొని యువత, ప్రజలను మొబైల్ యాప్ ద్వారా సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టే పలు సంక్షేమ పథకాలు ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు పాటుపడుతుందన్నారు. అధిక సంఖ్యలో పార్టీ సభ్యత్వ నమోదు అయ్యే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బీజేపీ సభ్యత్వం కోసం ప్రతి ఒక్కరూ 880002024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన సూచించారు. కర్నాల కిషన్, రాజయ్య ప్రభాకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకటేష్, సత్తయ్య, అనిల్, రమేష్, రమణ, రాయమల్లు, శ్రీధర్, పాల్గొన్నారు.

ఘనంగా గార్మీ జెండా పండగ

తాండూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లో ముస్లింలు సోమవారం రాత్రి గార్మీ జెండా పండగను నిర్వహించారు. తంగళ్లపల్లి, ఐబీలలో ఊరేగింపు నిర్వహించి గార్మీ పండగను నిర్వహించి మంగళవారం ఉదయం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రఫ్‌పటేల్, అత్తర్ హుస్సేన్, మోహపటేటల్, లతీఫ్ పటేల్, సాధిక్, గౌస్‌ఖాన్, అజర్, జియాఖాన్, షారుక్‌ఖాన్, పర్వేజ్, మైనార్టీ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గణితం, రసాయన శాస్త్రం గంటల ప్రాతిపదికన బోధించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో తెలిపారు. 9 వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోధించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 17లోగా సర్టిఫికెట్లతో దరఖాస్తులను అందజేయాలన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

వేమనపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్యం అందిం చాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఆసుపత్రి పరిసరాలను, వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లా డుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, మందులను అందు బాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల న్నారు. అనంతరం దస్నాపూర్‌లోని ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యా ర్థుల సంఖ్య తక్కువగా ఉందని ఉపాధ్యాయులను అడిగారు. సెలవుల తర్వాత విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో హాజరు కాలేదని ఉపాధ్యాయులు తెలిపారు. వంట గదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందించాలన్నారు. నీల్వాయిలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని లేకుంటే శాఖపరమైన చర్యలుం టాయన్నారు. వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచిం చారు. వేమనపల్లి పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అభి వృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

న్యూస్ బాక్స్

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా రమేష్

దండేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా రమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

భీమిని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కేస్లాపూర్ గ్రామంలో బుధవారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు హాజరవుతారని, ఉదయం 10 గంటలకు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పనులు ప్రారంభం

బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 19, 30, 31 వార్డుల్లో పలు అభివృద్ధి పనులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కమిషనర్ శ్రీనివాసరావు, ఏఈఈ సందీప్, టీపీవో అశిత్, కౌన్సిలర్లు సురేష్, కృష్ణ, నాయకులు శంకర్‌సింగ్, గెల్లి రాజలింగు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దండేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కాసిపేట గ్రామానికి చెందిన అంబటిపెల్లి సత్తవ్వ అనారోగ్యంతో మృతి చెందింది. కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్కకుల సృజన్‌కుమార్ మంగళవారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. పర్శ కాంతయ్య, నల్లెల మల్లేష్, నరేష్, సర్వగౌడ్, సత్యనారాయణ, సత్తన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రమదానం

కోటపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మల్లంపేట గ్రామానికి చెందిన సల్పాల విష్ణు, చిలకమారి రాజేందర్‌ల ఆధ్వర్యంలో యువకులు మంగళవారం చెట్ల కొమ్మలు తొలగించారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపుల తుమ్మచెట్ల కొమ్మలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన యువకులు చెట్ల కొమ్మలను తొలగించడంతో ఈ సందర్భంగా గ్రామస్థులు అభినందించారు.



నిధుల జాడేదీ..?

● విడుదల కాని 15వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి నిధులు ● మున్సిపాలిటీలో ముందుకు సాగని పనులు

కాగజ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్టీ అభివృద్ధికి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులు రాక పోవడంతో మున్సిపాల్టీలో అభి వృద్ధి పనులు జరుగడం లేదు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20లక్షలు, పట్టణ ప్రగతి నిధులు రూ.20లక్షలు ఏటా విడుదలయ్యేవి. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తర్వాత ఈ నిధుల విడుదలకు బ్రేక్ పడింది. నిధులు విడుదలైతే వార్డుల్లో అభివృద్ధి పనులు, కార్మికుల జీత భత్యాలు, కరెంటు బిల్లులు చెల్లించే అవకాశం ఉండేది. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20లక్షల వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నిధులతో గతంలో పట్టణ ప్రకృతి వనాలు, స్వచ్ఛ మున్సిపాల్టీ స్కీం కింద వార్డుల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టేవారు, ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్ పడటంతో పనులు ముందుకు సాగడం లేదు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో గతంలో చేసిన అభివృద్ధి పనుల తాలుకూ నిధులు విడుదల కాక పోవటంతో కాంట్రాక్టర్లు నిత్యం మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదిక్షణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పులు తెచ్చి పనులు చేశామని, ఇప్పుడు నిధులు విడుదల కావడం లేదని అధికారులు చెబుతున్నారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

● ఆస్తి పన్ను వసూళ్లతోనే..

కాగజ్‌నగర్ మున్సిపాల్టీ ఆర్థిక పరిస్థితులు కేవలం ఆస్తి పన్ను వసూళ్ల మీదనే ఆధారపడింది. 13వేల ఇళ్లకు సంబంధించి ఆస్తి పన్ను రూ.1.40 కోట్ల వసూలు చేయాల్సిన లక్ష్యంగా ఉంది. కాగా ఏటా రూ.80 లక్షలు వరకు మాత్రమే వసూలవుతోంది. ఆస్తి పన్ను పూర్తిగా జనరల్‌ఫండ్ ఖాతాలో జమ అవుతోంది. దీంతో ఇందులోంచే మున్సిపాలిటీలో పని చేస్తున్న 191 మంది కాంట్రాక్టు కార్మికులకు జీత భత్యాల చెల్లిస్తున్నారు. కార్మికుల జీత భత్యాలకు ఏటా రూ.2కోట్లకుపైగా చెల్లించాల్సి ఉంది. కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయక పోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. మిగితా అభివృద్ధి పనులు జరుగాలంటే ప్రత్యేక గ్రాంటు నిధులు విడుదల చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నిధుల విడుదల కావడం లేదు..



కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి. ఏటా వచ్చే ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడం లేదు. దీంతో పాటు పట్టణ అభివృద్ధి నిధులు కూడా రాలేదు. ఆస్తి పన్ను వసూళ్లతోనే కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నాం. గతంలో చేపట్టిన పనులకు సంబంధించి నిధులు రాకపోవడంతో బిల్లులు సైతం చెల్లించలేక పోతున్నాం.

-అంజయ్య, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

చింతలమానేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జవెల్లి నుంచి గూడెం వరకు ఉన్న ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని మండలానికి చెందిన నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ జాఫర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్డును ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ నెల 25 లోపు మరమ్మతులు చేపట్టక పోతే తాము మాజీ ఎమ్మెల్యే సహకారంతో శ్రమదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, రాజన్న, నీలాగౌడ్, శేఖర్, శ్రీమన్నా రాయణ, నారాయణ, అశోక్, మహేష్, రాజన్న, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆలం శైలజ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో ఈ నెల 16 నుంచి 19 వరకు జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు గిరిజన క్రీడాధకారి బండమీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జంగు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షకుడు విద్యాసాగర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రమాదేవి, ఏసీఎంఓ ఉద్దవ్, ఏటీడీఓ చిరంజీవి, జీసీడీఓ శకుంతల, శిక్షలు అరవింద్, తిరుమల్, ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థినిని అభినందించారు.

రేపు విద్యాసంస్థలకు సెలవు

ఆసిఫాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కుమరం భీం వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలువు దినంగా ప్రకటించినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలు ఈ నెల 17న సెలవు దినం పాటించాలని సూచించారు. బదులుగా నవంబరు 9న పని దినంగా నిర్వహించాలని తెలిపారు.

ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ కల్పిస్తామని డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న ఏజెన్సీలు, కొంత మంది దళారులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం కలెక్టర్‌కు ఏఐవైఎఫ్ చిరంజీవి వినతి పత్రం ఇచ్చారు. కొంత కాలంగా డీఎంహెచ్‌వో, మెడికల్ కాలేజీ నుంచి విడుదల అయిన నోటిఫికేషన్ ద్వారా స్థానిక నిరుద్యోగులు ఆశలతో దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఈ నోటిఫికేషన్ దృష్టిలో పెట్టుకుని స్థానిక నాయకులు నిరుద్యోగులను మభ్య పెడుతున్నారని తెలిపారు. దీనిపై విచారణ దనార్థనే ధ్యేయంగా పక్కా ఉద్యోగం కల్పిస్తామని చెప్పి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గోండ్‌కోసారలో వైద్య శిబిరం

వాంకిడి, అక్టోబరు 15: మండలంలోని గోండ్‌కోసార గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరంతో బాధపడుతున్న 9 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ రవిదాస్, ఏఎన్‌ఎంలు సునంద, ఆశా వర్కర్ సువర్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌ఇన్‌స్పెక్టర్లకు సన్మానం

బెజ్జూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో పని చేసి బదిలీపై వెళ్తున్న లైన్‌ఇన్‌స్పెక్టర్లు రాజేశం, రాజు, అశోక్‌ను మంగళవారం ఏఈ అంజల్ కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో పని చేయడం సంతృప్తినిచ్చిందని తెలిపారు.

సైబర్ మోసాలకు గురి కావద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలకు గురి కావద్దని మంగళవారం రైల్వేస్టేషన్‌లోని రద్దీ ప్రాంతంలో ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. పండుగల నేపథ్యంలో ఆఫర్లు అంటూ ఫోన్‌లు, మెసెజ్‌లు వచ్చినా స్పందించవద్దని, మెసెజ్ లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఫోన్ చేసి ఎవరైనా బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు, ఏటీఎం వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి డబ్బులు పోగొట్టుకుంటే టోల్‌ఫ్రీ నెబర్ 1930 ఫిర్యాదు చేయాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, కానిస్టేబుళ్ల మల్లేష్, గంగాధర్, సంపత్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

కాగజ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ కిమ్స్ ఆసుపత్రిలో మంగళవారం శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 18 మందికి శస్త్ర చికిత్సలు అసవరమున్నట్టు డాక్టర్లు నిర్ధారించారు. శస్త్ర చికిత్సలు అవసరమున్న వారికి లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచిత ఆపరేషన్లు చేయించనున్నట్టు శ్రీ కొత్తపల్లి వెంకట లక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ శిబిరంలో అప్తమాలజిస్ట్ ప్రోగ్రాం ఇన్‌చార్జీ ఐక్యాంపు గోపి, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ప్రజా బంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజా లైఫ్ కేర్ ఆసుపత్రిలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 41 మందికి పరీక్షలకు నిర్వహించారు. ఇందులో 28 మందికి ఆపరేషన్లు అవసరమని ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మంత్రి సీతక్క పర్యటన

ఆసిఫాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్‌లో బుధవారం మంత్రి సీతక్క పర్యటించనున్నారు. ఉదయం రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. అనంతరం ఆసిఫాబాద్ పట్టణంతో పాటు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

క్రైం కార్నర్

ఎమ్మెల్యే ఇంట్లోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఇంట్లోకి సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారని పట్టణ సీఐ బన్సీలాల్ మంగళవారం తెలిపారు. ముగ్గురు వ్యక్తులు మాస్కులు దరించి, చేతిలో కత్తులు పట్టుకొని ఎమ్మెల్యే ఇంటి ప్రహరీ దూకి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఆరు బయట నిద్రిస్తున్న వాచ్‌మన్ వారిని గమనించి అరుపులు, కేకలతో ఇంట్లోకి పరుగులు తీయడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ విషయమై ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు కూలీ మృతి

నస్పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీసీసీ కార్నర్ మేకల మండీ సమీపంలో భవనం పనులు చేస్తున్న నీరజ్ బైసన్ (35) మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రం లాంజీ గ్రామానికి చెందిన నీరజ్ బైసన్ భార్య కల్పనతో కలిసి ఏడాదిగా ఇక్కడ భవన నిర్మాణ పనుల్లో కూలీలుగా పని చేస్తున్నారు. మంగళవారం రెండంతస్తుల భవనం నిర్మాణ పనులు చేస్తుండగా కాలుజారి కిందపడి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మందమర్రిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామన్‌కాలనీ రైల్వే బ్రిడ్జి సమీపంలో మంగళవారం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన ప్రవీణ్‌కుమార్ (36) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పని ఉందని ఇంట్లో చెప్పి మందమర్రికి వచ్చి రైలు కింద పడి ఆత్మహత్యకు చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేష్ కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, మృతుడికి భార్య, కూతురు ఉన్నారని రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

తమ్ముడిపై అన్న దాడి : చికిత్స పొందుతూ మృతి

చెన్నూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్కెపల్లి గ్రామానికి చెందిన కొడిపె మల్లయ్య (45) చికిత్స పొందుతూ మృతిచెందాడు. మల్లయ్య, భీమయ్య ఇద్దరు అన్నదమ్ములు. మల్లయ్య ఇంటి బాత్‌రూం నీళ్ల భీమయ్య వరి గడ్డి వాములోకి వస్తున్నాయని ఆదివారం రాత్రి గొడవ పడ్డారు. భీమయ్య క్షణికావేశంలో తమ్ముడు మల్లయ్య తలపై కర్రతో కొట్టడంతో తీవ్ర గాయమైంది. వెంటనే మల్లయ్యను చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మల్లయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెంచికలపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొండపల్లి గ్రామానికి చెందిన కోట బుచ్చయ్య(53) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బుచ్చయ్య శుక్రవారం పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు వరంగల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుచ్చయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై ప్రభాకర్ తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు పట్టివేత



పట్టుకున్న నిషేధిత పొగాకు బస్తాలు

వాంకిడి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి మహారాష్ట్ర లోని చంద్రపూర్‌కు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత పొగాకు ఉత్పత్తు లను మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు ఏఎస్సై పోశెట్టి తెలిపారు. మండల కేంద్రంలోని సయ్యద్ ముస్తాఫ కిరాణ దుకాణం నుంచి కారు(ఎంహెచ్ 34 సీడీ 1070)లో రూ.2,20,240 విలువ గల నిషేధిత పొగాకు ఉత్పత్తులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పట్టుకున్నామన్నారు. డ్రైవర్ టెంబుర్‌కార్ చంద్రమౌళిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో వ్యక్తికి బెల్లంపల్లి కోర్టు జడ్జి ముకేష్ రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలోని గడ్డం మార్కండేయ ఇంట్లో దొంగలు పడి వెండి సామగ్రి, గోల్డ్, రూ. 23,500 నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌హెచ్‌వో రాజు కేసు నమోదు చేసి కాగజ్‌నగర్‌కు చెందిన సయ్యద్ సికిందర్ అలీని పట్టుకుని చార్జీషీట్ ఫైల్ చేశారు. నిందితున్ని కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువు కావడంతో రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల యజమానిపై కేసు నమోదు

తాండూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతి బాపూలే ఆశ్రమ పాఠశాలకు తాళం వేసిన బిల్డింగ్ యజమాని సురభి శరత్‌కుమార్‌పై పాఠశాల ప్రిన్సిపాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నస్పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ట్రాలీలో అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై లచ్చన్నలు తెలిపారు. రేషన్ బియ్యంను మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. 25 క్వింటాళ్ల రేషన్ బియ్యంతోపాటు ట్రాలీని స్వాధీనం చేసుకుని మంచిర్యాలకు చెందిన డ్రైవర్ సిరిగిరి సుధాకర్ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని సీసీసీ నస్పూర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

గ్రామసభ ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలి

కెరమెరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పేసా గ్రామసభ ద్వారానే ఇందిరమ్మ గృహ లబ్ధిదారులను ఎంపిక చేయాలని పేసా మండల అధ్యక్షుడు భరత్‌భూషన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు తప్పనిసరిగా అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు తుకారాం, ఆనంద్‌రావు, యదేరావు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమలామేరీ, సిరాజుల్‌హక్, కనకమ్మ, కిష్టయ్య, లింగయ్య, అచ్యుత్‌రావు, వెంకటయ్య పద్మ, పోచన్న, వెంకటేష్, రామారావు, రామస్వామి, నర్సయ్య, వినోద్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

దహెగాం అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై దృష్టి సారించాలని ఎస్సై రాజు అన్నారు. మండలంలోని కర్జీ గ్రామంలో నిర్వహిస్తున్న కేపీఎల్ లీగ్ క్రికెట్ పోటీల విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఫైనల్‌లో దహెగాం, కన్నెపల్లి జట్లు తలపడ్డాయి. దహెగాం జట్టు విజయం సాధించింది.

ఉపాధిహామీ పనుల పరిశీలన

కౌటాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఉపాధిహామీ, ఐకేపీ పనులను మంగళవారం నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఈసీ సంతోష్, ఏపీఎం ముక్తేశ్వర్, సీసీలు, టీఏలు, ఎఫ్ఏలు కార్యదర్శులు పాల్గొన్నారు.



గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): శాంతిఖని గని ఆవరణలో గైర్హాజరు కార్మికులకు గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతీ నెల 16 మస్టర్ల కన్నా తక్కువ చేసిన కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. ఉద్యోగ ప్రాముఖ్యతపై వివరించామని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి సత్యనారాయణ, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలని ఏరియా జీఎం బి సంజీవ రెడ్డి, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వృత్తి శిక్షణను మంగళవారం ప్రారంభిం చారు. టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్(డీటీపీ) కోర్సుల్లో నైపుణ్యం సాధించి ఆర్థికంగా ఎదగాలన్నారు. చాలా మంది మహిళలు గతంలో కోర్సుల ద్వారా ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



టైలరింగ్‌ను ప్రారంభిస్తున్న రాధాకుమారి

ఉపాధి కల్పనపై దృష్టి

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలోశిక్షణ

మందమర్రి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి కల్పనపై యాజమాన్యం దృష్టి సారించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో సింగరేణిలోని ఆరు జిల్లాల్లో విస్తరించిన కొన్ని ఏరియాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు కొనసాగిస్తున్నారు. కొద్ది నెలల క్రితం మందమర్రి ఏరియాలో ఈ స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేయగా సీఎండీ బలరాంతో పాటు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి ప్రారంభించారు. ఇప్పటి వరకు ఇక్కడ మూడు నెలలు పాటు శిక్షణ అందించారు. ప్రస్తుతం మందమర్రిలో కంప్యూటర్ ఉచిత శిక్షణ కోర్సులను ప్రవేశ పెట్టారు. పోటీ పరీక్షలకు ఇవి ఎంతగానో దోహదపడతాయని అధికారులు చెబుతున్నారు. ఉపాధి లేని వారికి ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు. మూడు నెలలు పాటు నిపుణులైన శిక్షకులచే శిక్షణ అందిస్తున్నారు. జీఎం దేవేందర్ పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తున్నారు.

బోనస్ ఇప్పించాలి

- కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్

శ్రీరాంపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తమకు బోనస్ డబ్బులు రాలేదని, వెంటనే ఇప్పించాలని కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీ పీవో కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. తాము 300లకు పైగా గౌరవ్ ఓబీ కంపెనీలో పనిచేశామని తెలిపారు. అయితే ఆ కంపెనీ కాంట్రాక్టు అయిపోవడంతో తమకు సింగరేణి అధికారులు ఇంతవరకు బోనస్ డబ్బులు 5 వేలు ఇవ్వలేదన్నారు. అందరికీ అందించినా తమకు రాకపోవడం దారుణమని వారు పేర్కొన్నారు. అధికారులను అడిగితే కంపెనీ ఫైనల్ అకౌంట్స్ సెటిల్ అయ్యిందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీవో శ్రీనివాస్ త్వరలో బోనస్ డబ్బులు అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఎంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డాక్టర్ మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు పరిష్కరించడం లేదన్నారు. . కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది 2వ ఎఎన్‌ఎంలు ప్రమీల, పద్మ, సునిత, విజయలక్ష్మి, తులసి, శ్రీ విద్య, రుచిత, మృదుల్ మండల్ పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రోజువారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలని జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. జీఎం కార్యాలయంలో మంగళవారం ఏరియా అధికారులతో సమీక్ష నిర్వహించారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. ముందస్తుగా ప్రణాళికలు వేసుకుంటే ఎలాంటి ఆటంకం ఉండదని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, పీఓలు శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్లు రాముడు, శ్రీధర్, డీజీఎంలు అరవిందవు, చిరంజీవులు, మల్లయ్య, గనుల మేనేజర్లు, రక్షణాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జీఎం

నేటి నుంచి జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు

మందమర్రిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో బుధవారం నుంచి రామగుండం ఏరియా 2లో 53వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు సింగరేణిలోని 11 ఏరియాల నుంచి రెస్క్యూటీంలు పాల్గొననున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి.

మామ చేతిలో అల్లుడి హతం

కన్నెపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సాలిగాం గ్రామంలో మామ గోలేటి శంకర్ అల్లుడు గోమాస నరేందర్(37)ను గొడ్డలితో నరికి చంపాడు. శంకర్‌కు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కుమార్తె బేబిని బెల్లంపల్లి మండలంలోని మాల గురిజాల గ్రామానికి చెందిన గోమాస నరేందర్‌కు ఇచ్చి 2016లో వివాహం జరిపించాడు. వివాహం అయినప్పటి నుంచి భార్య, అత్తామామలను అదనపు కట్నం కోసం వేధించేవాడు. ఈ యేడు ఫిబ్రవరిలో నరేందర్ అత్తామామలను చంపుదామని పిస్తోలుతో గ్రామానికి వచ్చి రెండు రౌండ్లు కాల్పులు జరిపి పారిపోయాడు. నరేందర్ కరీంనగర్‌లోని మహాలక్ష్మీ పేపరు ప్లేట్ల కంపెనీలో పని చేస్తున్నాడు. మంగళవారం అత్తగారింటికి వచ్చి ఆస్తి ఇవ్వాలని అత్తామామలతో గొడవకు దిగాడు. దీంతో కోపోద్రిక్తుడైన మామ శంకర్ అల్లుడు నరేందర్‌ను గొడ్డలితో తలపై నరకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ కుమారస్వామి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

భీమిని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి కిరణ్ కుమార్ కోరారు. బిట్టూరుపల్లిలో మంగళవారం పశువులకు టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధితో పశువు లకు నష్టం జరిగే ప్రమాదం ఉందని, ముందస్తు చర్యలు చేపడితే వ్యాధి నివారించవచ్చన్నారు.



పిండి వంటలు తయారు చేస్తున్న మహిళలు (ఫైల్)

● పౌర్ణమి నుంచి అమావాస్య వరకు
● ప్రత్యేక అలంకరణ, ఆటాపాటలు



గుడిరేవు గోదావరి తీరంలో ఉన్న పద్మాల్‌పురి కాకో ఆలయం

ఆధ్యాత్మికం

గిరిజన గూడేల్లో గుస్సాడి సందడి

దండేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజన గూడేల్లో గుస్సాడీ సందడి మొదలైంది. యేటా దసరా నుంచి దీపావళి పండుగ వరకు పద్మల్‌పూరీకాకో దేవాలయంలో దండారీ గుస్సాడీ వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. మండలంలోని గుడిరేవు గోదావరి నది తీరం ఒడ్డున పద్మల్‌పూరీకాకో దేవాలయం ఉంది. ఇక్కడ యేటా దసరా తర్వాత ఆశ్వీయుజ పౌర్ణమి గురువారంతో దండారీ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దీపావళి అమావాస్యతో ఉత్సవాలు ముగుస్తాయి. రాష్ట్ర నలుమూలల నుంచి గిరిజనులు కుటుంబసమేతంగా తరలివచ్చి కాకో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీపావళి వేడుకలతో గొండు గూడెలు కోలాహలంగా కనిపిస్తాయి. గిరిజనులు అంటేనే సంస్కృతి, సాంప్రదాయాలకు మారుపేరు. కుటుంబ సమేతంగా ఆలయం వద్దే రెండు రోజులు ఉండి పూజలు చేస్తారు. కొత్తగా పెళ్లైన జంటలను ఆలయంలో అమ్మవారి ముందు భేటీ (కొత్త కోడళ్ల పరిచయం) నిర్వహిస్తారు.

గుడిరేవు సమీపంలో గోదావరి తీరంలో ఉన్న పద్మాల్‌పురి కాకో దేవాలయం రాష్ట్రంలోనే ఆదివాసీల ఏకైక దేవాలయం. గ్రామానికి కిలోమీటర్ దూరంలో గోదావరి తీరంలో ఉంది. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీ తెగలు గోండు, ప్రదాన్, కోలాం, తోటీ తదితరులు ఇక్కడ పూజలు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో ఊట్నూర్, నార్నూర్, జైనూర్, గుడిహత్నూర్, ఇచ్చోడ, భోథ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, తిర్యాణి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి గిరిజనులు ఇక్కడికి వచ్చి పూజలు చేస్తారు. పురుషులు నెత్తిమీద నెమలి పింఛం ధరించి చేసే గుస్సాడీ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మహిళలు సైతం సాంప్రదాయ పద్ధతిలో చుట్టూ తిరుగుతూ దేవతలను కొలుస్తూ పాటలు పాడుతారు. పుష్య మాసంలో పెర్సాపేన్(జల్లిదేవర) పూజలు చేస్తారు.

గిరిజనుల ప్రత్యేక నైవేద్యాలు..

పద్మల్‌పూరీకాకో అమ్మవారికి ఇష్టమైన పిండి పదార్థాలు గిరిజనులు ప్రత్యేక నైవేద్యాలు తయారు చేస్తారు. పాయసంతో రుబ్బిన పెసరు, మినుము, బబ్బెర గారెలు తయారు చేసి కాకోబాయికి నైవేద్యంగా ప్రత్యేక పూజలతో సమర్పిస్తారు. వీటిని గానుగతో తయారు చేసి నువ్వులు, పల్లినూనె వేసి గిరిజనులు ఆలయం వద్ద వంటకాలు చేస్తారు. అనంతరం కోళ్లు, మేకలు కాకోబాయికి బలిచి విందు భోజనం చేస్తారు.

పద్మల్‌పూరీకాకో దేవాలయం వద్ద దసరా నుంచి దీపావళి అమావాస్య ముగిసే వరకు రోజు గిరిజన సంప్రదాయబద్ధంగా ప్రత్యేక భజనలు నిర్వహిస్తారు. గిరిజన పెద్దలు ఆనందోత్సవాల మధ్య గిరిజన బాషాలో ఆటాపాటల, నృత్యాలతో రాత్రి పగలు తేడా లేకుండా భజనలు కొనసాగిస్తుంటారు.



కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న గిరిజనులు (ఫైల్)



గుస్సాడి వేషధారణలో..

ఈ నెల 27న దండారీ దర్బార్

కాసిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సల్పలవాగు వెంక టాద్రి ఆలయంలో ఈ నెల 27న దండారీ దర్బార్ నిర్వహిస్తు న్నామని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆడె జంగు అన్నారు. మంగళవారం సల్పలవాగు వెంకటాద్రి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల, గోండుల సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తూ యేటా దర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 26 సాయంత్రంలోగా గుస్సాడీ బృందాలు ఆలయానికి చేరుకోవాలన్నారు. ఆదివాసీ సమస్యలపై దర్బార్‌ను నిర్వహిస్తున్నామని, అధికా రులు హాజరవుతారని తెలిపారు. ఆదివాసీలు, యువకులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సిడాం రాందాస్, పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, సోయం సూరు, మడావి వెంకటేష్, మడావి గోపాల్, టేకం రామకృష్ణ, సిడాం సోము, ఆత్రం జంగు, భగవంతరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆడె జంగు

ఐటీడీఏ డీఈఈపై చర్యలు తీసుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టర్లు

దండేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దండేపల్లి ఐటీడీఏ సబ్ డివిజన్ డీఈఈ శహబాద్ అహ్మద్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు జైనోద్దీన్, సయ్యద్‌ఇమామెద్దీన్, సయ్యద్ సాధిక్‌లు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐటీడీఏ డీఈఈ మూడేళ్ళుగా హెడ్ క్వార్టర్‌లో ఉండకుండ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. అభివృద్ధి పనుల బిల్లులు చెల్లింపులో జాప్యం చేయడంతో పాటు 5శాతం పర్సెంటేజీ ఇస్తేనే బిల్లులు ఇస్తానని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంతకాలు అవసరమైతే నిర్మల్, హైదరాబాద్ రావాలంటున్నాడని పేర్కొన్నారు. ఈ విషయంపై డీఈఈ శహబాద్ అహ్మద్‌ను వివరణ కోరగా ఐటీడీఏ కార్యాలయంలో సరైన వసతులు లేకపోవడంతో స్థానికంగా ఉండడం లేదన్నారు. పర్సెంటేజీ విషయం అవాస్తమని, కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందన్నారు. బిల్లుల విషయంలో ఎవరిని ఇబ్బందులకు గురి చేయలేదన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



భీమారంలో కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

భీమారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చేసిన సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మండల కేంద్రంలో గొర్రె మేకల వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మల్లేష్, అశోక్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాల, కేజీబీవీ, ప్రాథమిక, జెడ్పీహెచ్‌ఎస్, పారుపెల్లి, దేవుల వాడ, అన్నారం తదితర పాఠశాలల్లో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం శాస్త్ర సాంకేతిక రంగంలో చేసిన సేవలు, రాష్ట్రపతిగా ఆయన దేశానికి చేసిన సేవలను ఉపాధ్యాయులు వివరించారు.

మందమర్రి టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మనో వికాస్ దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మహంత్ అర్జున్‌కుమార్ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడు తూ దేశానికి కలాం అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. తన జీవితాన్ని దేశ ప్రజల ప్రగతి, సంక్షే మం కోసం పని చేశారని, ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పని చేయా లన్నారు. అనంతరం దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. సదానందం, వేణు, సురేందర్, మహంత్, సాయితేజ పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎంసీపీఐయూ వ్యవస్థాపక నేత మద్దికాయల ఓంకార్ వర్ధంతి సభల కరపత్రాలను మంగళవారం పార్టీ కార్యాలయంలో నాయకులు విడుదల చేశారు. ఈ నెల 17 నుంచి 31 వర కు రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత రాజకీయాలు, అంబేద్కర్ ఆలోచన విధానంపై సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులను విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కృష్ణరెడ్డి, జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, నాయకులు పసులేటి వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు నియామకాలు నిలిపివేయాలి

మందమర్రి టౌన్, అక్టోబర్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసినందున ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు ఉద్యోగ నియామకాలు చేప ట్టవద్దని ఎంఆర్‌పీఎస్ నాయకులు వాసాల శంకర్, తుంగపిండి శంకర్, ఆవునూరి పోషంలు పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లా డుతూ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని ముఖ్యమంత్రి ప్రకటించడంతో పాటు రాష్ట్రంలో వర్గీకరణ తామే అమలు చేస్తామని చెప్పారన్నారు. ముఖ్య మంత్రి తన మాట నిలుపుకోవాలన్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తుందని, మాదిగలకు, ఇతర ఉప కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. నాయకులు రాములు, సారయ్య, నంబయ్యలు పాల్గొన్నారు.

సవరణ

తేదీ.15.10.2024 మంగళవారం ఆంధ్రజ్యోతి 7వ పేజీలో 'నస్పూర్ గడీకి కొత్త అందాలు' శీర్షికన ప్రచురితమైన కథనంలో యజమాని పేరు పొరపాటున గోనె వెంకట అంశుమన్ రావుగా ప్రచురితమైంది. యజమాని పేరు జీవీ వసుమన్‌రావ్‌గా ప్రజలు గమనించ మనవి.

- ఎడిటర్

రోడ్డు భద్రతపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ బస్టాండ్ ఆవరణలో రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రిబుల్ రైడ్ చేయకూడదని, ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని చెప్పారు. గమ్యం యాప్ ప్రతి ఒక్కరు ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల బస్సు నంబర్ ఎంటర్ చేస్తే గమ్యం యాప్‌లో బస్సు ఎక్కడ ఉంది లోకేష్ క్లియర్‌గా చూపుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీ శంకర్, ఏడీసీ సేఫ్టీ వార్డెన్ పోచం తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలో అనస్థీషియా వైద్యుల పాత్ర కీలకం

నేడు ప్రపంచ అనస్థీషియా దినోత్సవం



మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో అనస్థీషియా పాత్ర కీలక పాత్ర పోషిస్తోంది. శస్త్రచికిత్సలకు ఆయువుగా నిలుస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు చాలా ఉన్నాయి. వీటిలో రోజు కొన్ని వందల సంఖ్యలో ఆపరేషన్‌లు జరుగుతుండగా అనస్థీషియా వైద్యులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఆపరేషన్ చేసే ప్రతి రోగికి అనస్థీషియా ఇచ్చిన తర్వాతనే ఆపరేషన్‌లు చేయాల్సి ఉండడంతో వారి పాత్ర ముఖ్యమైంది. తొలిసారిగా మత్తు మందు ఇచ్చి శస్త్రకిఇత్స చేసిన అక్టోబరు 16ను ప్రపంచ అనస్థీషియా దినోత్సవంగా జరుపుకుంటారు. శస్త్రచికిత్స చేసేటప్పుడు రోగికి భరించ లేని నొప్పి ఉంటుంది. దీంతో వైద్యులకు ఆపరేషన్ చేయడం సులువుకాదు. అనస్థీషియా ఇవ్వడంతో శస్త్రచికిత్స సులువవుతుంది. అనస్థీషియా ప్రాముఖ్యత గురించి ఆరోగ్య సంరక్షణ నిపుణులు ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

పేరుకుపోయిన బకాయిలు

(5వ పేజీ తరువాయి)

సొంత ఊళ్లకు వెళ్లిన విద్యార్థులు తిరిగి వచ్చేందుకు మరో రెండు మూడు రోజులు సమయం పట్టే అవకాశం ఉండటంతో తాళాలు వేసిన ఘటన ప్రభావం పెద్దగా చూపలేదు. అయితే బోధనా, బోధనేతర సిబ్బంది పాఠశాలకు వెళ్ళే సరికి తాళాలు వేసి ఉండడంతో బయటనే గడపాల్సి వచ్చింది. రెసిడెన్షియల్ స్కూళ్లకు భవన యజమానులు తాళాలు వేసిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా దావానంలా వ్యాపించింది. దీంతో ప్రభుత్వం తరుపున మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో యజ మానులు దిగొచ్చి తాళాలు తెరిచారు. కాగా రెసిడెన్షియల్ స్కూళ్ల భవనా లకు తాళాలు వేసిన యజమానులపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

అద్దె చెల్లించడం లేదని గురుకుల పాఠశాలకు తాళం

తాండూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ వెనకబడిన సంక్షేమ గురుకుల పాఠ శాలకు మంగళవారం భవన యజమాని సురభి శరత్‌కుమార్ తాళం వేశా రు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించకపోవడంతో పాఠశాల గేటుకు తాళం వేసినట్లు తెలిపారు. దాదాపు 11 నెలలుగా రూ.9.90 లక్షల బిల్డింగ్ బకాయిలు రావా లని పేర్కొన్నారు. మంగళవారం పాఠశాల ప్రారంభం కావడంతో గేటుకు తాళం వేయడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది గేటు బయటనే చాలా సేపు వేచి చూశారు.

జ్యోతి బాపూలే హాస్టల్‌కు తాళం

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే హాస్టల్‌కు అద్దె చెల్లించడం లేదని మంగళవారం హాస్టల్ భవనం యజమాని భావనరుషి కళాశాల గేటుకు తాళం వేశారు. ఆయన మాట్లాడుతూ 9 నెలల నుంచి బిల్లులు చెల్లించడం లేదని, రూ. 16 లక్షల బిల్లు రావాల్సి ఉందన్నారు. త్వరలోనే బిల్లు చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థులను హాస్టల్ లోపలికి పంపించారు.

ఏడు నెలలు బకాయి ఉన్నాయి

గోపీచంద్, జ్యోతిబాపూలే ఉమ్మడి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్



జిల్లా వ్యాప్తంగా ఎనిమిది బీసీ వెల్ఫేర్ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించి ఈ సంవత్సరం మార్చి నుంచి సెప్టెంబరు వరకు 7 నెలల కిరాయి చెల్లించాల్సి ఉంది. త్వరలోనే ప్రభుత్వం నిధులు విడుదల చేయనున్నట్లు ఉన్నతాధికారుల ద్వారా తెలిసింది. భవనాలకు తాళాలు వేశారన్న విషయం తెలియగానే మాట్లాడటం జరిగింది. యజమానులు తాళాలు తెరిచినందున విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఉపకార వేతనాలు చెల్లించే వరకు కాలేజీల బంద్

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యా ర్థులకు ఇచ్చే ఉపకార వేతనాలు, బోధన ఫీజులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాల అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల నుంచి పెండింగ్ బిల్లులను చెల్లించక పోవడంతో కళాశాలలను నడిపించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. బిల్డింగ్ అద్దె, జీతాల చెల్లింపు, నిర్వహణ ఖర్చులు చెల్లించలేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. బుధవారం బెల్లంపల్లి చౌరస్తా నుంచి విద్యార్థులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నామని, ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. వీరికి తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు మద్దతును తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కాగజ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంటు వెంటనే విడుదల చేయాలని పట్టణంలోని ప్రైవేట్ కళాశాల విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వివేకనంద జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుక్ మాట్లాడుతూ ప్రభుత్వం రీయింబర్స్‌మెంటు విడుదల చేయడం లేదన్నారు. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇతర ఫండ్ కూడా పెండింగ్‌లో ఉందన్నారు. కళాశాల నిర్వహణ కష్టతరంగా మారుతోందన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాలీలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు సిబ్బంది పాల్గొన్నారు.



మధురం.. సీతాఫలం

నస్పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన ఆరోగ్య ప్రదాయిని సీతాఫలం. చలికాలంలో లభించే సీతా ఫలాలకు భలే గిరాకీ వచ్చింది. ధర ఎక్కు వైనా నోరూరించే మధుర ఫలాలను తినాల్సిందే. ఇప్పుడిప్పుడే వివిధ ప్రాంతాల నుంచి సీతాఫలాలు మంచిర్యాల జిల్లాలోని మార్కెట్‌లోకి వస్తున్నాయి. అధిక ధర ఉన్నప్పటికీ ప్రజలు మక్కువతో కొనుగోలు చేస్తున్నారు.

ఆరోగ్య ప్రదాయిని....

సీతాఫలాలు ఆరోగ్యానికి ఎంతో మేలు కలిగిస్తాయి. ప్రకృతి వరప్రదాయినిగా పేరుగాంచిన సీతాఫలంలో అనేక పోషకాలున్నాయి. సీతాఫలంలో పిండి పదార్థాలు, ప్రొటీన్లు, పీచు పదార్థాలు బాగా లభ్యమవుతాయి. విటమిన్-సి, క్యాల్షియం, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం లాంటి ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. సీతాఫలంతో ఎముకలు బలంగా ఉంటాయని చెబుతున్నారు. మలబద్దకానికి సీతాఫలం ఔషధంగా పని చేస్తోంది. జలుబు, దగ్గు ఉన్న సమయంలో సీతా ఫలాన్ని తినకుండా కొద్ది రోజులు దూరంగా ఉం డడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

ధర ఎక్కువైనా కొనుగోళ్లపై మక్కువ..

వివిధ ప్రాంతాల నుంచి...

జిల్లాలోని వేమనపల్లి, కోటపల్లి, చెన్నూరు, అదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు, కోమురం భీం జిల్లాలోని కాగజ్‌నగర్, దహెగాం, నిర్మల్ జిల్లా లోని గ్రామీణ ప్రాంతాల నుంచి, నిజామాబాద్ జిల్లా తదితర ప్రాంతాలతోపాటు సిద్దిపేట జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వ్యాపా రులు లారీల్లో సీతాఫలాలను సీసీసీ కార్నర్ వద్దకు తీసుకువస్తారు. ఇక్కడి నుంచే మంచిర్యాల మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాలకు సరఫ రా చేస్తారు. సీతాఫలాలను చిన్న చిన్న వ్యాపార స్తులకు విక్రయిస్తారు.

పెరిగిన ధరలు...

పెద్దవి వంద రూపాయలకు ఐదు పండ్లు, చిన్నవి ఐదు రూపా యలకు ఒకటి చొప్పున వ్యాపారు లు అమ్ముతున్నారు. అరవైకాయ లు కలిగిన సంచి, బుట్ట రూ.350 నుంచి రూ. 400 వరకు విక్రయిస్తు న్నారు. అన్ని ప్రాంతాల నుంచి కాయ లు మార్కెట్లోకి వస్తే ధరలు దిగి వస్తా యి. ధరలు అధికంగా ఉన్నప్పటికీ సీతా ఫలాల అమ్మకాలు తగ్గకపోగా ఇంకా సరిపడ దొరకడంలేదు. జిల్లాలోని వివిధ ప్రాంతాల కూడళ్ళ వద్ద వ్యాపారులు సీతాఫలాలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
8



కుమరం భీం
జిల్లా వార్తలు
బుధవారం 16 అక్టోబరు 2024

కంది పంటను తొలగించిన అధికారులు

కాగజ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలోని కడంబా శివారులో పోడు భూముల్లో వేసిన కంది పంటను అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ విషయంలో గ్రామస్థులు అడ్డుకున్నప్పటికీ కూడా ఏ మాత్రం వినిపించుకోకుండా పంటలను పీకేయడంపై గ్రామస్థులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంది పంట ఏపుగా వచ్చిందని ఈ సమయంలో తమ పంటను నాశనం చేయడం ఎంత వరకు సమంజసమని రైతులు వాపోతున్నారు. కడంబా శివారులోని భూములు అటవీ శాఖ ప్లాంటేషన్‌కు కేటాయించారని ఈ స్థలంలో పంటలు వేయొద్దని చెప్పినా వినడం లేదని అధికారులు చెబుతున్నారు. కాగా మరో మూడు నెలలు గడిస్తే తమ పంట చేతికొచ్చేదని, ఇప్పుడు నష్టం వచ్చిందని పోడు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో శశిధర్ బాబును వివరణ కోరగా ఎఫ్‌డీవో ఆదేశాల మేరకు తాము పంటలను తొలగించామని తెలిపారు.

కొత్త టీచర్లకు పోస్టింగ్‌లు

కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులకు మంగళవారం పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందుకు సంబంధించి అధికారులు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి విధులను కేటాయించారు. ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా ప్రభుత్వం భర్తీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 9న ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేశారు. మంగళవారం అధికారులు కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తి చేశారు.

- జిల్లాలో 270 మంది ఉపాధ్యాయుల భర్తీ
- కౌన్సెలింగ్ ద్వారా కేటాయింపు
- నేడు విధుల్లో చేరనున్న అభ్యర్థులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరనున్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం పోస్టింగ్ అర్డర్లు అధికారులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జూలై, ఆగస్టులో నిర్వహించిన డీఎస్సీ ఫలితాలను విడుదల చేసింది. ర్యాంకుల ప్రకారం ధ్రువపత్రాలను పరిశీలిచారు. 2008 డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులను సైతం కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లోకి తీసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరనుంది.


ఆసిఫాబాద్‌లోని పాఠశాల భవనం


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

బదిలీలు, పదోన్నతులతో..

జిల్లాలో 341 ఉపాధ్యాయుల పోస్టులకు గానూ 270 భర్తీ చేశారు. మిగితా 71 పోస్టులను అనర్హత, ఇతర సమస్య వల్ల వాయిదా వేసినట్లు అధికారులు చెబుతు న్నారు. ఇటీవల బదిలీలు, పదోన్న తులతో ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు పొందారు. దీంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఖాళీలు ఏర్ప డ్డాయి. జిల్లాలో మొత్తం 341 ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. ఇందులో 209 ఎస్జీటీలు, 132 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. ఫలితాల అనంతరం 1:3లో 1023 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. పరిశీలన అనంతరం 341 మందికి నియామక పత్రాలను అందజేశారు.

విద్య వ్యవస్థ పటిష్ఠం..

జిల్లాలో 2024 డీఎస్సీ పోస్టుల భర్తీతో విద్య వ్యవస్థ పటిష్ఠం కానున్నది. కొత్త జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల ఆధారంగా ఈసారి నియామకాలను చేపట్టడంతో జిల్లా అభ్యర్థులకు ప్రయోజనం చేకూరనుంది. 2018లో నిర్వహించిన డీఎస్సీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలలో పోస్టింగులు ఇచ్చారు. రెండేళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత ఉపాధ్యాయులు వారి వారి జిల్లాలకు బదిలీపై వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో ఉపాధ్యాయుల పోస్టుల్లో విద్యావలంటీర్లను నియమించి విద్య బోధన చేపట్టాల్సిన పరిస్థితి ఉండేది. తాజాగా 2024 డీఎస్సీ నియామకాలు కొత్త జిల్లాల పరిధిలోనే ఇవ్వడంతో ఈ సమస్య లేకుండా పోయింది. జిల్లాలో ఖాళీగా ఉన్న 341 పోస్టులను భర్తీ చేయడంతో విద్యార్థులకు మెరుగైన విద్య అందనుంది.

కాంట్రాక్టు పద్ధతిలో..

డీఎస్సీ-2008 నష్టపోయిన అభ్యర్థులకు సైతం కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లోకి తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో 135 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు రానున్నాయి. ఇందులో జిల్లాలో 25 నుంచి 30 మంది విధుల్లోకి చేరే అవకాశం ఉన్నట్లు సంబందిత అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు భర్తీ అయితే విద్యార్థులకు నాణ్యమైన అందనుంది.

భీం వర్ధంతిని విజయవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


గీత కార్మికులకు పంపిణీ చేసిన రక్షణ కిట్లు

కెరమెరి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జోడేఘాట్‌లో గురువారం నిర్వహించనున్న కుమరం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని లెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా, ఎస్పీ డీవీ శ్రీనివాసరావులతో కలిసి మంగళవారం జోడేఘాట్ మ్యూజియం సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవంగా కొలుస్తున్న కుమరం భీం 84వ వర్ధంతిని అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి విజయవతం చేయాలన్నారు. శాఖల వారీగా కేటాయించిన పనులను బుధవారం సాయంత్రం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్, వీఐపీ, వీవీఐపీల కోసం ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. వాహనాల కోసం ప్రత్యేక ఏర్పాటు చేయాలని, హట్టి బేస్ క్యాంపు నుంచి జోడేఘాట్ వరకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఉమర్ షరీఫ్, ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తప్రసాద్‌రావు, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమం, రక్షణ కోసం ప్రభుత్వం ప్రమాదాలు జరగకుండా వారికి శిక్షణను ఇచ్చి కాటమయ్య రక్షణ కిట్లను అందిస్తుందన్నారు. సిర్పూర్ నియోజక వర్గంలో 38 మంది గీత కార్మికులకు, ఆసిఫాబాద్ నియోజక వర్గంలో 31 మందికి ఈ కిట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ గీత వృత్తిని గౌడ కులస్తులు తరాల నుంచి కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. గీత కార్మికుడిపై కుటుంబం ఆధార పడి ఉంటుందని, రక్షణ కిట్లను ధరించి వృత్తిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్‌లతో కలిసి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అలీబీన్ అహ్మద్, బీసీ సంక్షేమాధికారి సజీవన్, ఎక్సైజ్ సీఐ రమేశ్, గౌడ సంఘం నాయకులు బాలేష్‌గౌడ్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ సభ్యుల నిరసన దీక్ష


దీక్షలో కూర్చున్న లారీ అసోసియేషన్ సభ్యుల కుటుంబీకులు

కాగజ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సభ్యులు అసోసియేషన్ కార్యాలయంలో ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ బాబు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను కూడా ఇంత వరకు జేకే యాజమాన్యం పరిష్కరించడం లేదన్నారు. తమకు లోడింగ్ పాయింట్లు పెంచాలని కోరినప్పటికీ కూడా ఇంత వరకు పట్టించుకో లేదన్నారు. యాజమాన్యం మొండివైఖరి వీడనాడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ లారీ అసోసియేషన్ సభ్యుల డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరిచాలని కోరారు. లారీ అసోసియేషన్ సభ్యుల పోరాటానికి పూర్తి మద్దతు అందజేస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ లారీ అసోసియేషన్ సభ్యుల న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అసో సియేషన్ సభ్యులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి


రెబ్బెనలో మాట్లాడుతున్న ఎంపీ గెడం నగేష్

రెబ్బెన, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు పాటుపడాలని ఎంపీ గెడం నగేష్ పిలుపునిచ్చారు. రెబ్బెన మండలంలోని నారాయణపూర్‌లో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. భారత దేశ సమగ్రతకు బీజేపీ కట్టుబడి ఉన్నట్టు వివరించారు. బీజేపీకి ఆదరణ పెరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచేలా కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అనంతరం పలువురు రైతులు, యువకుల చేతుల మీదుగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటు కో కన్వీనర్ కిరణ్ కుమార్, పార్టీ మండల అధ్యక్షులు గోలెం తిరుపతి, అసెంబ్లీ కన్వీనర్ జి.చక్రపాణి, సొల్లు లక్ష్మి, సుగుణాకర్, వసంత్, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: బీజేపీతోనే మారు మూల గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎంపీ గొడెం నగేష్ అన్నారు. మంగళవారం తిర్యాణిమండల కేం ద్రంలో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, కిరణ్‌కుమార్ సొల్లు లక్ష్మి, చక్రపాణి, విజయ్‌కుమార్, వెంకటేష్, రమేష్ గౌడ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విధులను నిర్లక్ష్యం చేయొద్దు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధులను నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్న పాఠశాలలో మంగళవారం నిర్వహించిన డీఎస్సీ-2024 అభ్యర్థుల కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 340 పోస్టులు ఖాళీ ఉండగా కౌన్సెలింగ్‌కు 270 మంది హాజరయ్యారని అన్నారు. ఉపాధ్యాయులుగా నియమితులైన వారు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 15: సిర్పూర్ పేపరు మిల్లు ప్రతినిధులు, లారీ ఓనర్స్ అసోసియోషన్ సభ్యులు సమస్యలను సమన్వయంతో సమరస్యంగా పరిష్కరించుకొవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సిర్పూర్ పేపరు మిల్లు ప్రతినిధులు, లారీ ఓనర్స్ అసోసియోషన్ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, మిల్లు ప్రతినిధులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అసౌకర్యాల మధ్య కౌన్సెలింగ్

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 15: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డీఎస్సీ కౌన్సెలింగ్ అసౌకర్యల మధ్య అర్ధరాత్రి వరకు కొనసాగింది. విద్యాశాఖ అధికారులు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం నుంచి కౌన్సెలింగ్‌ను వాయిదా వేయలంటూ సందేశం రావడంతో జిల్లా కేంద్రానికి తరలి వచ్చిన అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి ప్రభుత్వం నుంచి కౌన్సెలింగ్‌ను కొనసాగించాలని విద్యాశాఖ అధికారులకు అదేశాలు వచ్చాయి. దీంతో కౌన్సెలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పాఠశాల ఆవరణలో ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాల గదుల్లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో పూర్తిగా చీకటిలోనే అభ్యర్థులు ఉండాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. సెల్‌ఫోన్ వెలుతురులోనే నియామక ఖాళీల జాబితాలను అభ్యర్థులు పరిశీలించుకున్నారు. కౌన్సెలింగ్‌ను సమీకృత కలెక్టర్‌లో నిర్వహించకుండా విద్యాశాఖ అధికారులు జడ్పీ బాలికల పాఠశాలలో నిర్వహించడంతో అవస్థలు పడ్డారు. ఖాళీల జాబితాను అందరికి కనిపించే విధంగా ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించాల్సి ఉండగా విద్యాశాఖ అధికారులు తారుమారు చేయడంతో అభ్యర్థులు అయోమయానికి గురైనట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి ఆరోపించారు.


సెల్‌ఫోన్ వెలుతురులో జాబితాను చూసుకుంటున్న అభ్యర్థులు